

# అస్తమాతో.. జాగ్రత్త!

ఏటా పెరుగుతున్న వ్యాధిగ్రస్తులు

చలికాలంలో సమస్య తీవ్రం

చిన్నారులపై తీవ్ర ప్రభావం

దీర్ఘకాలికం గాకుండా జాగ్రత్తలు మేలు

**అస్తమా(ఉబ్బసం) వ్యాధి దీర్ఘకాలం పాటు విడువకుండా వేధించే క్రానిక్ డీసిజ్. ఈ సమస్యతో ఊపిరితిత్తులోకి ప్రాణవాయువును తీసుకువెళ్లే శ్వాసకోశ నాళాలు, లోపాల గోడలు ఉబ్బిపోతాయి. ఫలితంగా శ్వాస తీసుకోవడం కష్టంగా మారుతుంది. ప్రత్యేకించి పెద్దవారి కంటే ఈ వ్యాధి వల్ల పిల్లల్లోనే ముప్పు ఎక్కువ. ఎందుకంటే వారి శ్వాసకోశ నాళాలు చాలా చిన్నవిగా ఉంటాయి. అస్తమాతో చిన్నారులకు ఎక్కువగా ప్రాణాపాయం ఉంటుంది. మారుతున్న వాతావరణ పరిస్థితులు, కాలుష్యంతో రెండు దశాబ్దాలుగా అస్తమా వ్యాధిగ్రస్తుల సంఖ్య ఏడాదికేడాది పెరుగుతున్నది. ఈ పరిస్థితుల్లో తల్లిదండ్రులు చిన్నారులపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముంది. లేదంటే వ్యాధి తీవ్రత పెరిగి దీర్ఘకాలిక వ్యాధిగా సంక్రమించే అవకాశం ఉంది.**

– న్యూస్ నెట్‌వర్క్, జనవరి 3

### ఆధునిక వైద్య విధానాలు

ప్రాథమిక స్థాయిలోనే అస్తమాను గుర్తిస్తే త్వరగా నయం చేయవచ్చు. వ్యాధి ముదిరితే దీర్ఘకాలిక చికిత్స అవసరం అవుతుంది. గతంలో ఈ వ్యాధి నివారణ కోసం ట్యాబ్లెట్లు, ఇంజక్షన్లు వాడేవారు. దీంతో కొన్ని దుష్పరిణామాలు చోటు చేసుకునేవి. చేతులు, కాళ్లు వణకడం, షుగర్, బీపీ వంటి సమస్యలు ఎదురయ్యేవి. ఇటీవల కాలంలో పీల్చే మందులు అందుబాటులోకి వచ్చాయి. వీటిని స్వల్ప, దీర్ఘకాలిక కోర్సులుగా వాడుతున్నారు.



పెరుగుతున్న పట్టణీకరణ, వాతావరణ కాలుష్యంతో అస్తమా బాధితులు ఎక్కువవుతున్నారు. పరిశ్రమలు విస్తరించడం, వాహనాల కాలుష్యం మరో కారణం. నివాస గృహాలతో పాటు పరిసరాల పరిశుభ్రత లేకపోవడం, ఇంట్లో వాడే దిండ్లు, పరుపుల్లో పేరుకున్న దుమ్ము వల్ల అస్తమా బారినపడే ప్రమాదముంది. తడి గోడల వల్ల డస్ట్ మైట్స్ సూక్ష్మ క్రిములు చేరి వ్యాధి కారకాలుగా మారే అవకాశముంది. మరోవైపు పెరుగుతున్న పరిశ్రమల వల్ల భవిష్యత్‌లో అస్తమా వ్యాధిగ్రస్తులు పెరిగే అవకాశముందని వైద్యవర్గాలు హెచ్చరిస్తున్నాయి.

### అస్తమాకు చికిత్స

- అస్తమా వ్యాధిగ్రస్తులు ప్రాథమిక దశలోనే వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలి.
- ఊపిరితిత్తుల పరీక్షలు చేసి అస్తమాకు చికిత్సలు పొందవచ్చు.
- యోగా, వ్యాయామంతో అస్తమాను నియంత్రణలో ఉంచుకోవచ్చు.
- ప్రస్తుతం ఎన్నో రకాల మందులు వ్యాధి నియంత్రణకు అందుబాటులో ఉన్నాయి.

### వ్యాధి లక్షణాలు

- దగ్గు
- ఆయాసం, పిల్లి కూతలు
- రాత్రి వేళల్లో సరిగా నిద్ర పట్టకపోవడం
- శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడడం

### వ్యాధికి కారణాలు

- కాలుష్యం ప్రధాన కారణం
- వంశపారపర్యంగా వచ్చే అస్తమా
- ధూమపానం అధికం కావడం
- ఆస్పిరిన్, బీటా బ్లాకర్స్ వంటి మందుల వల్ల
- పారిశ్రామిక వాడల్లో వెదజల్లే రసాయనాల కాలుష్యం వల్ల

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- అలర్జీ కారకాలకు సాధ్యమైనంత దూరంగా ఉండాలి
- దుప్పట్లు, దిండు కవర్లు తరచూ వేడి నీటిలో శుభ్రంగా ఉతికి వాడుకోవాలి
- ధుమ్ము, ధూళి ఉన్న చోటికి వెళ్లకుండా ఉండడం మంచిది.
- ఇల్లు ఊడవడానికి బదులుగా తడి గుడ్డతో తుడవడం వల్ల దుమ్ము నుంచి ఉపశమనం కలుగుతుంది.
- పెంపుడు జంతువులకు సాధ్యమైనంత వరకు దూరంగా ఉండాలి.
- పుప్పొడి రేణువులు గాలిలో ఎక్కువగా ఉండే సీజన్లలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- శీతల పానీయాలు, ఐస్ క్రీంలు, ఫ్రిజ్ వాటర్‌కు వీలైనంత దూరంగా ఉండాలి.



# అవిశ్వాస అస్త్రం.. 'ఆర్థిక' లక్ష్యం!

- ఇదే అదునుగా భావిస్తున్న కార్పొరేటర్లు, కౌన్సిలర్లు
- మిగిలిన ఏడాదిలో వచ్చే పనులూ ఏమీ లేవనే భావన
- రాజకీయానికి మించి ఆర్థిక కోణంలోనే ఆరాటం



To

The Collector & District Magistrate,

Ranga Reddy District,

Telangana State.

Sir/Madam,

We the undersigned members of Adibatla Municipal Council, Ranga Reddy District, hereby give notice of our intention as required by section 37 of Telangana Municipalities Act, 2019, to make a motion expressing want of confidence on Smt. Kotha Arthika & Kore Kalamma Vice Chairperson of the said Municipal Council at a meeting to be specially convened for the purpose The sanction strength of Municipal council is 15 Members and the number of Ex-officio Members is4...

A copy of the motion proposed to be made is enclosed signed at Friday the day of 05th Jan 2024

| Sl.No | Name of the Member with Ward Number | Signature of the Member |
|---|---|---|
| 1 | Smt. Nallavolu Lavanya 1st | N. Lavanya |
| 2 | Smt. KUntla Mounika 2nd | K. Mounika |
| 3 | Smt. Kanthi Sandya 3rd | K. Sandya |
| 4 | Shri. Koppu Krishna raju 4th | [illegible] |
| 5 | Shri. Vanamula Srinivas 5th | |
| 6 | Shri. Kola Nagesh 6th | K. Nagesh |
| 7 | Shri. Neelia Haridas 7th | N. HARIDAS |
| 8 | Shri. Gopagalla Mahender 8th | [illegible] |
| 9 | Shri. Marri Niranjan Reddy 9th | [illegible] |
| 10 | Smt. Marri Archana 11th | [illegible] |
| 11 | Smt. Narani Mounika 12th | [illegible] |
| 12 | Shri. Potti Ramulu 13th | [illegible] |
| 13 | Shri. Kamandla Yadagiri 15th | [illegible] |

ఆదిబట్లలో సభ్యులు సంతకం చేసిన అవిశ్వాస తీర్మానం కాపీ



అవిశ్వాసం పెట్టాలని స్థానిక సంస్థల సూపరింటెండెంట్ రమేశ్‌నాయక్‌కు తీర్మానం కాపీని అందజేస్తున్న ఆదిబట్ల మున్సిపల్ కౌన్సిలర్లు

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జనవరి 5 (నమస్తే తెలంగాణ)/ఆదిబట్ల: మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో అవిశ్వాసాల పండుగ వచ్చింది. ప్రస్తుతం ఉన్న పాలక మండలి గడువు మరో ఏడాదితో ముగియనుంది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో ఇప్పటికిప్పుడు పెద్ద ఎత్తున నిధులుగానీ, పనులుగానీ వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. దీంతో ఉన్న ఈ ఏడాదిలోనే ఇల్లు చక్కబెట్టుకోవాలనే కార్పొరేటర్లు, కౌన్సిలర్ల ఆర్థిక చూపు కూడా పలు చోట్ల అవిశ్వాసాలకు కారణమవుతుంది. మరికొన్ని కోట్ల రాజకీయ పరిణామాల దృష్ట్యా అవిశ్వాసాలు తెరపైకి వస్తున్నా... తటస్తంగా ఉండే కార్పొరేటర్లు, కౌన్సిలర్లు సైతం ఇదే అదునుగా ఆర్థిక వెసులుబాటును చూసుకుంటున్నారు. మరోవైపు రాజకీయ పంతాలతో మేయర్-ఛైర్మన్ పదవుల కోసం కొందరు కోట్లాది రూపాయలు వెచ్చించేందుకు ముందుకు వస్తుండగా... ప్రస్తుతం ఉన్న వారు రాజకీయంగా, ఆర్థికంగా మరో ఏడాది మనుగడ సాధించేందుకు నోట్ల కట్టలకు రబ్బరు బ్యాండ్స్‌ను విప్పాల్సిన అనివార్యత కూడా నెలకొంది. దీంతో ఈ నెలాఖరు వరకు నగర శివారుల్లో అవిశ్వాసాల సందడి కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇందులో భాగంగా తాజాగా ఆదిబట్ల మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌పై అవిశ్వాస బావుటా ఎగిరింది. ఈ మేరకు కౌన్సిలర్లు కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం కూడా ఇవ్వడం విశేషం.

నగర శివారుల్లోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో అవిశ్వాసాల సీజన్ వచ్చింది. వాస్తవానికి చాలాచోట్ల గత ఒకటీ, రెండు సంవత్సరాలుగా మేయర్లు, ఛైర్మన్లపై కార్పొరేటర్లు, కౌన్సిలర్లు గుర్రుగా ఉన్నారు. కానీ నిబంధనల ప్రకారం వారిపై అవిశ్వాసానికి అవకాశం లేకపోవడంతో ఇన్నాళ్లూ వారికి చేతులు కట్టేసినట్లుగా ఉంది. కానీ ఈ నెలాఖరుతో దాదాపు అన్ని స్థానిక సంస్థల కాలం నాలుగు సంవత్సరాలు దాటనుండటంతో తిరుగుబావుటాకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్, ఇబ్రహీంపట్నం, పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీల్లో అవిశ్వాసానికి ఇప్పటికే రంగం సిద్ధమైంది. తాజాగా ఆదిబట్ల మున్సిపాలిటీలో ఏకంగా అవిశ్వాస తీర్మానమే శుక్రవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు చేరింది. మిగిలిన ప్రాంతాల్లో కూడా త్వరలోనే ఈ మేరకు తీర్మానాలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా వీటిల్లో రాజకీయ పరిణామాలు, పంతాలు ఒకవంతైతే... వివిధ పార్టీల్లోని కార్పొరేటర్లు, కౌన్సిలర్లకు అవిశ్వాసం అనేది కామధేనువుగా మారింది. చాలాకాలంగా మేయర్, ఛైర్మన్లు తోటి సభ్యులను పట్టించుకోవడం లేదు. పనుల విషయంలోనూ వారి అభిప్రాయాలను పరిగణలోనికి తీసుకోవడం లేదు. దీంతో కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ఇదే అవకాశంగా భావించి.. అవిశ్వాసానికి గళం కలుపుతున్నారు. ఎలాగూ అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఖజానా పరిస్థితి అంతంత మాత్రంగానే తయారైంది. కేసీఆర్ ప్రభుత్వంలో సీఎం స్పెషల్ ఫండ్, ఇతరత్రా మార్గాల నుంచి నిధులు రావడం వల్ల తమ పరిధుల్లో అభివృద్ధి పనులైనా జరుగుతాయనే ఆశాభావం వారిలో ఉండేది. కానీ ఇప్పుడు కొత్త సర్కారు చివరి ఏడాదిలో ఆర్థికంగా పెద్దగా ఆదుకునే పరిస్థితి ఉండదని, దీనికి తోడు రాజకీయాల కారణంగా పనులేవీ ముందుకుపడవని కార్పొరేటర్ ఒకరు అన్నారు. అందుకే అవిశ్వాసం సందర్భాంగానైనా తమకు ఆర్థిక కొంత ఊరట కలుగుతుందని మనసులోని మాట వెల్లడించారు. తానే కాదు... చాలామంది ప్రజాప్రతినిధులు ఇదేరీతిన ఆలోచిస్తున్నారని, ఉన్న ఒక్క ఏడాదిలో కొంత ఆర్థికంగా రావాలంటే అవిశ్వాసం తప్ప వేరే మార్గమేమీ కనిపించడంలేదన్నారు.

### ఆదిబట్లలో అధికార పార్టీలోనే పుట్టిన ముసలం..

**కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మాన పత్రాన్ని ఇచ్చిన 13 మంది కౌన్సిలర్లు**

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఆదిబట్ల మున్సిపాలిటీలో అధికార పార్టీలోనే ముసలం మొదలైంది. ఇక్కడ 15 వార్డులు ఉండగా... బీఆర్ఎస్, కాంగ్రెస్ చెరో ఏడు స్థానాల్లో గెలవగా, బీజేపీ ఒక స్థానాన్ని గెలుచుకుంది. కాంగ్రెస్‌కు చెందిన కొత్త ఆర్తీక అప్పట్లో బీఆర్ఎస్‌లోకి వచ్చి మేయర్ పీఠం ఎక్కారు. కొన్నిరోజులుకే తిరిగి కాంగ్రెస్‌లోకి వెళ్లారు. దీంతో అవిశ్వాసం కోసం పలువురు కౌన్సిలర్లు ప్రయత్నాలు చేసినా.. నిబంధనలు అడ్డువచ్చాయి. కాగా ప్రస్తుతం ఆ సమయం రావడంతో కౌన్సిలర్లకు అవకాశం వచ్చింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆరుగురు, బీఆర్ఎస్‌కు చెందిన మరో ఆరుగురితో పాటు బీజేపీకి చెందిన కౌన్సిలర్ కూడా అవిశ్వాసానికి సిద్ధమయ్యారు. దీంతో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ మినహా మిగిలిన వారంతా శుక్రవారం అవిశ్వాస తీర్మాన పత్రాన్ని కలెక్టర్‌కు పంపించారు.

### ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఏకపక్షనిర్ణయాలతోనే...

ఆదిబట్ల మున్సిపాలిటీ పాలక వర్గం ఏర్పడినప్పటి నుండి అనేక నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. కాంగ్రెస్ పార్టీ టికెట్‌పై పోటి చేసి గెలుపొందిన కొత్త ఆర్తీక నాటకీయ పరిణామాల మధ్య బీఆర్ఎస్ పార్టీలో చేరి ఛైర్మన్ అయ్యారు. ఛైర్మన్ ఎన్నిక సమయంలో అప్పటి కాంగ్రెస్ ఎంపీ కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అప్పటి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మధ్య తీవ్రస్థాయిలో రాజకీయ ఘర్షణ రేగింది. ఛైర్మన్ రేసులో ఉన్న మరో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ మర్రి నిరంజన్ రెడ్డి ఆ అవకాశం చేజారిన తర్వాత ఛైర్మన్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ కౌన్సిలర్లతో కలిసి నిత్యం వ్యతిరేకంగానే వ్యవహరించారు. కౌన్సిల్ సమావేశాల్లోనూ వాగ్వాదానికి దిగేవారు. కాగా ప్రస్తుతం నిబంధనల ప్రకారమే అవకాశం రావడంతో అవిశ్వాస అస్త్రం ప్రయోగిస్తున్నారు.

# నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

మొయినాబాద్, జనవరి 5 : ప్రతి ఏటా సంక్రాంతి పండుగకు ముందు ఆదివారం చిలుకూరు భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. నాలుగు రోజులు ఉత్సవాలు జరుగనున్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లను పూర్తి చేసింది. శనివారం స్వామి వారికి సాయంత్రం 6 గంటలకు గంగ స్నానం, అభిషేకం, ఆదివారం ఉదయం 9 గంటలకు ధ్వజారోహణం, మల్లికార్జునస్వామికి అభిషేకం, 10 గంటలకు ఎల్లమ్మ లగ్నం, మధ్యాహ్నం ఎల్లమ్మ బోనాలు, మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవం మధ్యాహ్నం 1.30 గంటలకు కనుల పండువగా నిర్వహించడానికి ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. సాయంత్రం 4 గంటలకు భక్తులు బోనాలను సమర్పించనున్నారు. ఆలయం ముందు భాగంలో ఏర్పాటు చేసిన అగ్ని గుండాలను సాయంత్రం 5.30 గంటలకు శివసత్తులు, పోతురాజులతో తొక్కిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు ఒగ్గువారు ఉక్కు గొలుసు తెంపుట కార్యక్రమం నిర్వహిస్తారు. రాత్రి ఒగ్గు కథలు, సోమవారం సాయంత్రం 3 గంటలకు ఆలయం ముందు భాగంలో పసుపు, కుంకుమ, రంగులతో వేసే సదరు పటంను తొక్కే కార్యక్రమం, సాయంత్రం 5 గంటలకు చిలుకూరు గ్రామంలో హనుమాన్ దేవాలయం నంచి చిలుకూరు గ్రామంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపు కార్యక్రమం, మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు నల్లపోచమ్మ బోనాలు అమ్మవారికి సమర్పించనున్నారు.

బ్రహ్మోత్సవాలకు జిల్లాతో పాటు హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించనున్నారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకోవాలని, అందరూ సహకరించి విజయవంతం చేయాలని ఆలయ కమిటీ ఛైర్మన్ సంగరి మల్లేశ్ కోరారు.



మల్లికార్జున స్వామి ఆలయం







# నుమాయిష్..నయాజోష్

**ఎగ్జిబిషన్‌కు రోజురోజుకు పెరుగుతున్న సందర్శకుల తాకిడి.. సంక్రాంతి వరకు మరింత పెరిగే అవకాశం**



నుమాయిష్‌కు తరలివచ్చిన సందర్శకులు

సిటీబ్యూరో, జనవరి 5 (నమస్తే తెలంగాణ) / అబిడ్స్ : నగరంలో నుమాయిష్ 'నయా' జోష్‌ను నింపింది. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఈనెల 1న మొదలైన 83వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన వచ్చే నెల 15వ తేదీ వరకు 45రోజుల పాటు కొనసాగనున్నది. నాలుగు రోజుల కిందట ప్రారంభమైన ఈ ఎగ్జిబిషన్‌కు రోజురోజుకు సందర్శకుల తాకిడి పెరుగుతున్నట్లు ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు తెలిపారు. సంక్రాంతి వరకు మరింత పెరుగనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది అంచనాలకు మించి దాదాపు 25 లక్షల పైచిలుకు సందర్శకులు రానున్నట్లు సొసైటీ ప్రతినిధి సంజీవరావు తెలిపారు. ఇదిలా ఉండగా ఎగ్జిబిషన్‌కు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రవేశ ద్వారాల వద్ద మెటల్ డిటెక్టర్లతో తనిఖీలు చేసిన తర్వాతే సందర్శకులను లోపలికి అనుమతిస్తున్నారు. అగ్నిమాపక యంత్రాలను సైతం అందుబాటులో ఉంచారు.

### విద్యుత్ వెలుగుల్లో జిగేల్ మంటున్న స్టాల్స్..

1938లో ఉస్మానియా గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాంపల్లి పబ్లిక్ గార్డెన్‌లో ప్రారంభమైన ఎగ్జిబిషన్ 1946లో ఎగ్జిబిషన్ మైదానంలోకి మారింది. అప్పటి నుంచి 26 ఎకరాల సువిశాల మైదానంలో ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం సందర్శకుల కోసం 2400 స్టాల్స్ అందుబాటులో ఉన్నాయి. ఫుడ్ కోర్ట్స్, హ్యాండీ క్రాఫ్ట్ వస్తువులు, ఫర్నీచర్, క్లాత్ స్టాల్స్, అమ్యూజ్‌మెంట్ పార్కు ఆకట్టుకుంటున్నాయి. సందర్శకులు ఎగ్జిబిషన్‌లో ట్రైన్‌పై మైదానం మొత్తం చుట్టివస్తున్నారు.

### మెట్రో రైలు సమయం పొడిగింపు

అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనకు సందర్శకులు రోజురోజుకు పెరుగుతున్నారని ఎగ్జిబిషన్ సొసైటీ పబ్లిసిటీ కన్వీనర్ జీవీ రంగారెడ్డి పేర్కొన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ జనవరి 1వ తేదీన ప్రారంభమైన ప్రదర్శనకు సందర్శకులు తరలి వచ్చి స్టాల్స్‌లలో విక్రయాలు చేపడుతున్నారని తెలిపారు. నగరంలో విస్తృత ప్రచారం కల్పిస్తున్నామని, సందర్శనకు తరలి వచ్చే సందర్శకుల కోసం ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులను నడపడంతో పాటు మెట్రో రైలు సమయాన్ని పొడిగించిందన్నారు. సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, సీసీ కెమెరాల నిఘా, పోలీస్ శాఖ ద్వారా బందోబస్తు, వలంటీర్ల ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు వివరించారు.